క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రోటర్లీ క్లబ్ సభ్యులు

వేటపాలెం: వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జాండ్రపేట గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి రోటర్లీ క్లబ్ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. ఈఅవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. రోటరీ ధ్యేయం సేవచేయటమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఏవీ సురేష్‌బాబు, యారాజు గణపతి, గుత్తి పరంజ్యోతి, సీతారామయ్య, రోహిణి కుమార్ పాల్గొన్నారు.

టమోటా లోడు వాహనం బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన టమోటా లోడు వాహనం

మార్టూరు: టమోటా లోడుతో వెళ్తున్న వాహనం అదుపుతప్పి రహదారిపై పడిన ఘటన జొన్నతాళి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో జరిగింది. ఏఎస్సై మహబూబ్‌బాషా వివరాల మేరకు.. ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు టమోటా లోడుతో వెళ్తున్న ఐషర్ వాహనం అతివేగంతో అదుపుతప్పి జొన్నతాళి వద్ద రహదారిపై పడింది. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించగా లారీలో ఉన్న డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై సేఫ్టీ కోన్లను ఏర్పాటు చేసి ఇతర వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ప్రమాద తీవ్రతకు లారీలోని టమోటా బాక్సులు రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి.

4వ తేది నుంచి 144 సెక్షన్ అమలు

వేటపాలెం: సాధారణ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈ నెల 4వ తేదీ నుంచి మండల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై జీ సురేష్ శనివారం తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండడం కానీ బాణసంచా కాల్చడం, సంబరాలు చేసుకోవడం, రంగులు జల్లుకోవడం పూర్తిగా నిషేధించడమైందని తెలిపారు. 4వ తేదీ ఉదయం నుంచి 5వ తేదీ సాయంత్రం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆ రోజు వ్యాపారస్తులు వారి దుఖాణాలు స్వచ్ఛందంగా మూసివేయాలని కోరారు. అల్లర్లకు పాల్పడే వారిపై ఖటిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యద్దనపూడి (పర్చూరు): జూన్ 4న ఎన్నికల కౌటింగ్ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై రమేష్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

3 వేల మందికి మజ్జిగ పంపిణీ



బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: హనుమజ్జయింతిని పురస్కరించుకుని చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కస్తూరిబా గాంధీ మున్సిపల్ హైస్కూలు కూడలిలో గుర్రం బదరినాథ్, గుంటూరు రామమోహనరావు సహకారంతో 3,000 మందికి చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు బాటసారులకు మజ్జిగ పంపిణి చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ తెలిపారు. హైస్కూలు క్రీడామైదానంలోని మరుగుదొడ్లను దత్తత తీసుకుని ప్రతిరోజు శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. అలానే మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని క్రీడా మైదానంలో వివిధ రకాల ఆటలు ఆడుతున్న క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా ఉదయం పూట చల్లని మంచినీరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పేరాల కూరగాయల మార్కెట్ ఎదురుగా మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో చారుగుళ్ల గురుప్రసాద్, అమరా వీరాంజనేయులు, గుర్రం బదరీనాథ్, షేక్ దరియా సాహెబ్, చింతా రమేష్, జి. రమేష్, రాధాకృష్ణ, మధుసూదనరావులు పాల్గొన్నారు.

జయ హనుమాన జ్ఞాన గుణ సాగర



అలంకరణలో కొత్తపాలెం అభయాంజనేయుడు



వేటపాలెం ప్రత్యేకాలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి మూల విరాట్



పూనూరులో ...



బోస్‌నగర్‌లో వీరాంజనేయస్వామి ..



శింగరకొండలో మామిడి పండ్లతో పూజలు చేస్తున్న అర్చకులు

- ఘనంగా హనుమజ్జయంతి
- జై.. హనుమాన్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

చీరాల అర్బన్/వేటపాలెం: ఎక్కడ రామనామం వినబడుతుందో అక్కడ ఆంజనేయస్వామి ఉంటాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. రామభక్త పరాయణుడు, బహు పరాక్రమశాలి ఆంజనేయుడి జన్మదినాన్ని హనుమజ్జయంతిని శనివారం దేవాలయాలల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. హనుమత్ జయంతి సందర్భంగా చీరాల పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. స్థానిక బోస్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి తెల్లవారుజాము నుంచే పూజలు నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, స్వామివారి పంచామృతాలతో అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలానే పేరాలలోని భావనారుషి దేవాలయం ఆవరణలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం, విశేష పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలానే మదన గోపాలస్వామి దేవాలయం, సాయిబాబా గుడి ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం , కొత్తపేట ఓంకార క్షేత్రంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపరాజుతోటలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

➜ వేటపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో హనుమజ్జయంతి పురస్కరించుకొని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓన్‌వే రోడ్డులో గల శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామివారి దేవస్థానం, వీరాంజనేయ స్వామి దేవస్థానం, సంతరావూరి రోడ్డు పక్కన గల ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణగావించారు.

శింగరకొండలో ప్రత్యేక పూజలు..

అద్దంకి రూరల్/అద్దంకి/జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పలు గ్రామాలలో హనుమజ్జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేదరమెట్ల తూర్పుపాలెం అభయాంజనేయస్వామి వారి వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసా పఠిస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గల హనుమ విగ్రహం వద్ద భక్తులు భజనలు చేస్తూ స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బొడ్డువానిపాలెంలో కొలువైన హనుమత్ విగ్రహం వద్ద భక్తులు పూజలు మొక్కులు సమర్పించారు. గ్రామానికి చెందిన పాపిశెట్టి విజయ వెంకటేశ్వర్లు రూ.50 వేలకు పైగా విలువ గల వెండి తమలపాకుల దండ, వెండి కనుపాపలు, కనుబొమ్మలను సమర్పించారు.



అనంతవరంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న నారాయణం శ్రీనివాసాచార్యులు



పాపరాజుతోటలోని దేవాలయంలో ప్రత్యేక పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి

➜ బల్లికురవ మండలంలో హనుమజ్జయంతి వాడవాడలా ఘనంగా నిర్వహించి అన్నసంతర్పణ చేపట్టారు. కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, కొణిదెన, గంగపాలెం, కూకట్లపల్లి, సమీపంలోని బొగ్గులకొండ, అంబడిపూడి, వల్లాపల్లి చెన్నుపల్లి, కొండాయపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాల్లోని అభయాంజనేయస్వామి, వీరాంజనేయస్వామి, ప్రసన్నాంజనేయస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం, తమలపాకులతో అర్చన ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

పవనసుతుడికి విశేషపూజలు..

మార్టూరు/కారంచేడు/చినగంజాం/యద్దనపూడి: హనుమజ్జయంతి సందర్భంగా జై హనుమాన్ నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో క్షేత్రపాలకుడిగా వెలిసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు నారాయణం మనోజ్‌కుమార్ విశేషపూజలు నిర్వహించారు. మండలంలోని అనంతవరం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు స్వామివారికి అభిషేకాలు, సింధూరపూజ, చందనోత్సవం, నారికేళ, అరటిపండ్లు, తమలపాకులతో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

➜ మార్టూరు మండలం వలపర్ల గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్య గల పొలిమేర వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలతో పాటు ఆలయ 37వ వార్షికోత్సవ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల భక్తుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ఆకు పూజ అనంతరం సువర్చలా సహిత వీరాంజనేయస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్నదాన అనంతరం , కోలాటం, ఎడ్ల ప్రదర్శన, బృందావనం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బొడ్డువానిపాలెంలో హనుమ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తపాలెంలో అభయాంజనేయుడికి క్షీరాభిషేకం



కారంచేడులో హనుమ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తూ భజనలు చేస్తున్న మహిళలు



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఏజెంట్లు కౌంటింగ్‌కు సహకరించాలి



హాజరైన నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది



కౌంటింగ్ సిబ్బందికి సూచనలందిస్తున్న చీరాల ఆర్వో సూర్యనారాయణరెడ్డి

చీరాల టౌన్: కౌంటింగ్ సిబ్బంది ఓట్లు లెక్కింపును సమర్థవంతంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపుపై కౌంటింగ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో సూర్యనారాయణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ఈనెల 4తేదీన బాపట్ల జిల్లా కేంద్రంలోని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందన్నారు. 4 తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకల్లా కౌంటింగ్ సిబ్బంది విధిగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, నియోజకవర్గానికి కౌంటింగ్ 16 రౌండ్లలో జరుగుతుందని, 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే కౌంటింగ్ సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం ఆదేశాలను విధిగా పాటించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు, హోం ఓటింగ్ ఓట్లు, ఈవీఎంలు సీలు తీసే విధానం, ఓట్లు లెక్కించే విధానంపై పలు సూచనలను ఆర్వో సూర్యనారాయణరెడ్డి వివరించారు. సమావేశంలో ఏఈఆర్వోలు, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, తహశీల్దార్ నాసరయ్య, ఎంపీడీవో శోభారాణి, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తుదిదశకు చేరిన క్రికెట్ పోటీలు



కొణిదెన-ముక్తేశ్వరం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద జరగుతున్న జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు తుది దశకు చేరాయి. గత నెల 17న ప్రారంభమైన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 32 టీమ్‌లు ఎంట్రీలు సమర్పించగా హోరాహోరీగా నువ్వానేనా అన్నట్లుగా జట్లు తలబడుతున్నాయి. శనివారం ఉదయం ముక్తేశ్వరం, కొమ్మాలపాడు మధ్య జరిగిన పోరులో ముక్తేశ్వరం జట్టు, మధ్యాహ్నం కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం కొమ్మినేని పాలెం జట్టు విజేతగా నిలిచింది. సాయంత్రం ముక్తేశ్వర, కొణిదెన జట్ల మధ్య హోరాహోరి పోరులో ముక్తేశ్వరం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం తుదిపోరులో విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహక కమిటీ తెలిపారు.

కాలేజీలో అడ్మిషన్లపై స్పెషల్ డ్రైవ్



విద్యార్థులనుంచి అడ్మిషన్ తీసుకుంటున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బల్లికురవ: ప్రభుత్వ కళాశాలలోనే ఒత్తిడిలేని విద్యతో అత్యుత్త ఫలితాలు సాధిస్తున్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం కళాశాలలోని అధ్యాపకులతో కలిసి కొణిదెన గ్రామంలోని అడ్మిషన్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాస్థాయిలో సీఈసీ గ్రూపులో 913, 912 మార్కులతో పుట్టరాజు వెంకట దత్త సాయిశ్రీ,, కందుకూరి సాగరిక, ప్రథమ ద్వితీయ స్థానాకుల ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మొదటి రెండవ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ఫోటోలు, బ్రోచర్లతో కూడిన పత్రాలతో విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. మీ బిడ్డలను తీర్చిదిద్దే బాధ్యత తమదేనని బైపీసీ, ఎంపీసీ, సీఈసీ తెలుగు. ఇంగ్లీషు మీడియంలలో అనుభవనీయులైన అధ్యాపకులు పర్యవేక్షణలో వారంతపు, మాసాంతర పరీక్షలతో ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తామని ప్రిన్సిపల్ వివరించారు. కళాశాల సాధిస్తున్న ఫలితాలు చూసి పలువురు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. సోమవారం నుంచి తరగతులు నిర్వహిస్తామని మొదటి, రెండవ సవత్సరం విద్యార్థులు కళాశాలకు రావాలని ప్రిన్సిపాల్ వివరించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం వైశాఖ మాసం ఉత్తరాభాద్ర నక్షత్రం దశమి తిధి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు →



15 మంది దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు



దివ్యాంగ విద్యార్థిని పరీక్షిస్తున్న సర్వే బృందం

సంతమాగులూరు (అద్దంకి): మండలంలో సమగ్ర శిక్ష సర్వే ద్వారా 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులను 15 మందిని గుర్తించినట్లు ఎంఈవో కోటేశ్వరరావు శనివారం తెలిపారు. సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఈ సర్వేను గత నెల 9వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. దానిలో భాగంగా శనివారం ఎంఈవోల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని చెప్పారు. సర్వే బృందానికి దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని చెప్పారు. వినికిడి లోపం, మూగ, వికలత్వ అవయవాలు ఉన్నటువంటి వారికి మరే ఇతర లోపాలున్న వారిని గుర్తించి ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, సామాన్య విద్యను భవిత కేంద్రం ద్వారా అందిస్తారని చెప్పారు. సర్వే కార్యక్రమంలో ఎంఈవో ఎంఈవో టూ దినేశ్‌కుమార్, టీచర్లు ఏ శేఖర్‌బాబు, పీ శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీలు ఫిలిప్‌రెడ్డి, బీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళాలు



సహాయ కమిషనర్‌కు విరాలు అందజేస్తున్న దాత

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ రాతి ముఖమండప నిర్మాణానికి అద్దంకి కి చెందిన వజ్రాల అంజిరెడ్డి సతీమణి వజ్రాల సుబ్బాయమ్మ రూ. 100116 లక్షను దేవస్థాన సహాయక కమిషనర్ టి. సుభద్రకు శనివారం అందజేశారు. అలాగే ఒంగోలుకు చెందిన జగన్నాథం వీరాంజనేయులు ధర్మపత్ని స్వాతి రూ. 100116ను సుభద్రకు అందజేశారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో స్థానిక స్వర్ణరోడ్డులోని ఎస్ ఆర్‌డీఆర్, ఎస్‌వీపీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు 'మానవ జీవనం–ఆధ్యాత్మిక లక్ష్యం' అనే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక పీఠం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీవాసవీ హైస్కూలు వీ. వెంకటరావు, ఎంఎస్. ప్రసాదరావు శనివారం తెలిపారు. రాచర్లకు చెందిన టీటీడీ ఉపన్యాసకులు, ఎంఈవో అల్లూరు శివకోటేశ్వరరావు ఉపన్యాసకులుగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆధ్యాత్మికతను సంతరించుకోవాలని వారు కోరారు.